క్లుప్తంగా

రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ సందీప్, వైస్ చైర్మన్‌గా మెట్టు గంగాధర్, కోశాధికారిగా మంగారపు తుక్కన్న, సంయుక్త కార్యదర్శిగా శెడ్మోళ్ల చెర్లన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను వీడీసీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు.

తాణాకలాన్ వీడీసీ అధ్యక్షుడిగా ఆకుల సురేష్



ఎడపల్లి(బోధన్): తాణాకలాన్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. వీడీసీ అధ్యక్షుడిగా ఆకుల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రవికుమార్, మఠం లక్ష్మణ్, కోశాధికారిగా వి నోద్, శ్రీనివాస్, ప్రధాన కోశాధికారులుగా స త్యనారయణగౌడ్, సాయిలు, కార్యదర్శిగా చాకలి గంగారాం, భరత్, ప్రధాన కార్యదర్శు లుగా సూర రాజేందర్, రవి, సలహాదారులు గా రాజారెడ్డి, అబ్బయ్య, రమేష్, అనిల్‌రెడ్డి, మైబెల్లి, మురళి, శంకర్ ఎన్నికయ్యారు.

మాణిక్‌భండార్ వీడీసీ..

మాక్లూర్: మాణిక్‌భండార్ అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపత్ వినోద్, కార్యదర్శిగా నర్సయ్యయోల్ల లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా మాలోవత్ రాయ్‌సింగ్, ఉపాధ్యక్షులుగా అర్జున్‌సింగ్, కృష్ణవిరహస్, సంయుక్త కార్యదర్శిగా రాస అరుణ్, క్యాషియర్‌గా అనీల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామాభివృద్ధి నూతన కమిటీ అధ్యక్షుడు సంపత్ వినోద్ తెలిపారు.

పాలాభిషేకం

రుద్రూర్: మండల కేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటాలకు తెలంగాణ ఉద్యమకారులు పాలాభిషేకం చేశారు. వర్ని ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు రుద్రూర్ సమావేశమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమకారుల త్యాగాలను గుర్తిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం ఉద్యమించిన వారిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మండల తెలంగాణ ఉద్యమకారులు తిగుళ్ల రాజా వరప్రసాద్, డాక్టర్ మహజన్ విశ్వనాథ్, కారంగుల ప్రవీణ్, చింతకుంట గౌస్, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద యూత్, వీరయ్య సూపర్ మార్కెట్, చైతన్య చిల్డ్రన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులను పరీక్షించి మందులు అందచేశారు. చిల్డ్రన్ స్పెషలిస్ట్ చిదుర నవీన్ మాట్లాడుతూ.. ప్రతీ నెల రెండు, నాల్గవ గురువారం మధ్యాహ్నం నుంచి జిల్లా కేంద్రంలో చిన్నారులకు ఉచితంగా చికిత్స చేస్తామని, వినియోగించుకోవాలని కోరారు.

నోట్‌బుక్కులు, పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వేల్పూర్: పచ్చలనడ్కుడ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు జాన్కంపేట్ కారోబార్ అగ్గువంశీ తండ్రి అగ్గ నాగయ్య స్మారకార్థం వితరణ చేసిన నోట్‌బుక్కులు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం అందజేశారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు 60 మందికి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సొడ ప్రేమలత, ఉప సర్పంచ్ సొడ రమేశ్, ఎంపీటీసీ సొడ చందన్ కుమార్, మాజీ ఎంపీటీసీ గాదెపల్లి సత్యంరెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వినోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి



రుద్రూర్: గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనంలో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) కోటగిరి మండల కన్వీనర్ సాయిలు ప్రభుత్వాన్ని కోరారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించి నెలకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. మండల కేంద్రంలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కొండబాయి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే సబ్ డివిజన్

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అదనపు డ్యూటీలతో ఉన్నవారు సతమతం
- ఊసే లేని నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు



బోధన్ పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయం

బోధన్‌టౌన్(బోధన్): మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న బోధన్ ప్రాంతం పోలీస్ డివిజన్ కేంద్రంగా ఉన్నా అరకొర సిబ్బందే ఉన్నారు. ఈ డివిజన్ కేంద్రానికి రెండు సర్కిల్ కేంద్రాలు, 7 పోలీస్ స్టేషన్‌లు ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బోధన్ డివిజన్‌లో 10 మండలాలు, 182 గ్రామాలు, ఒక పట్టణం ఉన్నాయి. 8 లక్షలకు పైగా జనాభా ఉంది. డివిజన్ కేంద్రం పరిధిలో ఒక పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు 6 రూరల్ పోలీస్ స్టేషన్‌లు, రెండు సర్కిల్ కేంద్రాలు ఉన్నాయి. ఈ డివిజన్ కేంద్రానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు ఆనుకొని ఉండడంతో ఈ ప్రాంతంలో నేరాలు కూడా అధికంగా ఉన్నాయి.

మట్కా, పేకాటతో పాటు దేశిదారు, గంజాయి తరహా కేసులు నమోదవుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలపై సాలూర, కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ అక్రమంగా దేశిదారు, గంజాయి రవాణా అవుతూనే ఉన్నాయి. రాష్ట్రాలను విభజిస్తూ మంజీరా, గోదావరి నది సరిహద్దులు ఉండడంతో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ క్రమంలో శాంతి భద్రల పరిరక్షణ కోసం డివిజన్ కేంద్రానికి ఏసీపీ, పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోతో కలిపి ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 11 మంది ఏఎస్‌ఐలు, 14 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 126 మంది కానిస్టేబుల్స్ మొత్తం డివిజన్ పరిధిలో 164 మంది ఉన్నారు. డివిజన్ పరిధిలో 242 నుండి 300 మంది వరకు సిబ్బంది ఉండాల్సి ఉండగా 164 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పండుగలు, ఉత్సవాలు, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన సందర్భాలలో ఉన్న పోలీసులు సిబ్బంది రోజు వారీ విధులతో పాటు అదనపు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల బోధన్ పట్టణంలో గంజాయి కేసు నమోదు కాగా, గంజాయి కొనుగోలు చేసిన ప్రాంతం మహారాష్ట్రలోని కొండల్‌వాడిగా తేలింది. బోధన్ బస్టాండ్‌లో రూ.40 లక్షల విలువ చేసే బంగారంతో పాటు కిలో వెండి చోరీకి గురైంది. ఇదే కాకుండా డివిజన్ కేంద్రానికి అనుకొని ఉన్న నాగన్‌పల్లి సమీపంలోని పెట్రోల్ బంక్‌లో చెడ్డీ గ్యాంగ్ తరహాలో పెట్రోల్ బంక్ సిబ్బందిపైకి దాడికి యత్నిస్తూ చోరీకి యత్నించారు. ఈ రెండు కేసులు దర్యాప్తు చేసిన పోలీసులకు ఈ చోరీ మహారాష్ట్రకు చెందిన ముఠా పనే అని నిర్ధారణ అయ్యింది. వీటితో పాటు పలు చిన్నా, చితకా కేసులు డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్నాయి. డివిజన్ కేంద్రంలో గతంలో 8 మండలాలు ఉండగా ప్రభుత్వం సాలూర, పొతంగల్, చందూర్, మోస్రా మండలాలను అదనంగా ఏర్పాటు చేసింది. మండలాలు ఏర్పాటు చేసినా అక్కడ పోలీస్‌స్టేషన్‌లు మాతం ఏర్పాటు చేయలేదు.

మహిళా పోలీస్ స్టేషన్ కరువు

బోధన్ డివిజన్ కేంద్రంలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఉండాల్సి ఉండగా ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది. మహిళా హెడ్ కానిస్టేబుల్స్ ఉన్నప్పటికి వారు మామూలు విధులకే పరిమితమవుతున్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నప్పటికి పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంటుంది.

డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు డివిజన్ కేంద్రానికి పూర్తి స్థాయిలో పోలీసు సిబ్బందిని నియమించి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపాం



బోధన్ డివిజన్ పరిధిలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించేందుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాగే నూతనంగా ఏర్పాటైన మండలాల్లో పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటు అంశం ఉన్నత అధికారుల దృష్టిలో ఉంది. – కిరణ్ కుమార్, ఏసీపీ

వచ్చే ఏడాదికి సిద్ధమయ్యేనా..?



కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు..

- నత్తనడకన కేజీబీవీ భవన నిర్మాణ పనులు
- అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల



శిలాఫలకం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణ పనులు వచ్చే విద్యా సంవత్సరానికి పూర్తయ్యేలా కనపడటం లేదు. భవన నిర్మాణం కోసం 2021లో రూ.3.5 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తున్నాయి. ఇంకా గోడలకు సిమెంట్ ప్లాస్టరింగ్ చేయలేదు. పనులు నత్త నడ్పేలా సాగుతున్నాయి. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభానికి ఇంకా ఐదు మాసాల సమయం ఉంది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి అప్పటి వరకు అయిన పనులను పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్లాస్టరింగ్ పనులు పూర్తయితే సిమెంట్ పనులు దాదాపుగా పూర్తయినట్లే. కరెంట్, ప్లంబింగ్, ఫ్లోరింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా 2018లో ముప్కాల్ మండలం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీ పాఠశాలను మండల కేంద్రంలో ప్రారంభించారు. అప్పటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతుంది. పాఠశాలలో 5వ తరగతి నుంచి 10 తరగతి వరకు 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు వసతి కూడ పాఠశాల వద్దనే కావడం వల్ల ఎక్కువగా గదులు అవసరం ఉంటుంది. కానీ అద్దె భవనంలో కొనసాగడం వల్ల విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయించాల్సి అవసరం ఉంది.

కలెక్టర్, ఆర్డీవోలను సస్పెండ్ చేయాలి



దీక్ష చేస్తున్న మైనార్టీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికల విషయంలో తప్పుడు నివేదికలు సృష్టిస్తున్న జిల్లా కలెక్టర్, ఆర్మూర్ ఆర్డీవోను సస్పెండ్ చేయాలని మైనార్టీ కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన చైర్ పర్సన్ ఎన్నికకు అడ్డు పడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరిని నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మైనార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైర్ పర్సన్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ నాయకులు నివేదికలు తారుమారు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వైస్ చైర్మన్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించి నూతన చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించకుంటే కలెక్టరేట్ ముట్టడి చేపడుతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, మైనార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సాగర్ కాలువ పరిశీలన



రుద్రూర్ : పోతంగల్ మండలంలోని నిజాంసాగర్ కాలువను ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పరిశీలించారు. కాలువ శిథిలావస్థకు చేరి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగు నీరందడం లేదని రైతుల విన్నపం మేరకు మండల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కాలువలో పూడిక పేరుకుపోయి సాగు నీరందడం లేదని, సుంకిని నుంచి కొల్లూర్, రాంగంగా నగర్, సోంపూర్ శివారుకు సాగు రావడం లేదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. సంబంధిత మంత్రి, అధికారులు దృష్టికి సమస్య తీసుకెళ్తామని ఆయన హామీనిచ్చారు. మాజీ ఎంపీపీ పుప్పాల శంకర్, కోటగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు షాహీద్, హన్మంత్ రావ్, మల్లుగొండ, రాజు, సాయిలు, దత్తు తదితరులున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి



బాగేపల్లి జీపీ పాలకవర్గం సభ్యులను సన్మానిస్తున్న కార్యదర్శి, గ్రామస్తులు



అక్బర్‌నగర్ జీపీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తూ..

రెంజల్(బోధన్): గ్రామస్తులు అందించిన సహాయ సహకారాలతోనే గ్రామంలో అభివృద్ధి జరిగిందని బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలు తెలిపారు. ఆదివారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శ్రీకాంత్, పాలకవర్గం సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జీపీ పాలకవర్గం సభ్యుల పదవీకాలం పూర్తవడంతో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు సత్కారం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌ను గ్రామస్తులు సన్మానించారు.

అక్బర్‌నగర్‌లో..

రుద్రూర్: అక్బర్‌నగర్ గ్రామంలో జీపీ పాలకవర్గ సభ్యులను ఆదివారం స్థానిక నాయకులు సన్మానించారు. గ్రామ పంచాయతీ పదవీ కాలం ముగియనుండడంతో సర్పంచ్ గంగామణి ప్రసాద్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నగేష్, మాజీ సర్పంచ్ డి.భీమప్ప, నాయకులు రాంబాబు తదితరులు ఉన్నారు.

మాల సంఘం ఆధ్వర్యంలో..

మాక్లూర్: పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం అడవి మామిడిపల్లి మాల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి, ఎంపీపీ మాస్త ప్రభాకర్‌లను ఘనంగా సన్మానించారు. గ్రామ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులు చింత పురుషోత్తం, భూపతి చిన్నమ్మ, తలారి పుణ్యరాజ్ లను కూడ సన్మానించారు. మాల సంఘం అధ్యక్షుడు భూపతి రవి, కార్యదర్శి దేవతి లింగన్న, కోశాధికారి కూనసాగర్, ఉపాధ్యక్షులు భూపతి, రాజేశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కళాశాల సిబ్బందితో రోటరీ క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: మహిళలకు ఉచితంగా అందిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని సొంత కాళ్లపై నిలబడాలని రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో రోటరీ క్లబ్(ఆర్మూర్)ఆధ్వర్యంలో బుసిరెడ్డి శంకర్ రెడ్డి అధికారిక పర్యటనలో భాగంగా క్లబ్‌ను సందర్శించారు. స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపి కృష్ణ, సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. నవనావ సిద్దుల గుట్టను సందర్శించిన అనంతరం జర్నలిస్టు కాలనీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కుర్చీలు, టేబుళ్లను అందజేశారు. అనంతరం మెడికల్ భవన్‌లో రోటరీ క్లబ్ పబ్లిక్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరి గవర్నర్ మాట్లాడుతూ.. క్లబ్ సేవలు ఆదర్శనీయమని అన్నారు. రూ.25 లక్షలు ఇవ్వడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. క్లబ్ కార్యదర్శి పట్వారీ తులసి, కోశాధికారి లక్ష్మీ నారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్పకరావు పాల్గొన్నారు.

జోరందుకున్న బెల్ట్ దందా!

- మెండోరా మండలంలో విచ్చల విడిగా బెల్ట్‌షాపులు
- మామూళ్ల మత్తులో అధికారులు



వెల్కటూర్‌లో దర్జాగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపు

బాల్కొండ: మెండోరా మండల పరిధిలో బెల్ట్ దందా జోరుగా సాగుతోంది. దీంతో పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. మెండోరా మండల పరిధిలో మెండోరా, దూదిగాం గ్రామాల్లోనే లైసెన్స్ ఉన్న వైన్స్ షాపులు ఉన్నాయి. మెండోరా మండల పరిధిలో 10 గ్రామాలు ఉంటాయి. అన్ని గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా బెల్ట్‌షాపులను ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో అయితే వైన్స్ షాపులను తలపించేలా పెద్ద పెద్ద షాపులు పెట్టి నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. బెల్ట్ షాపుల నిర్వాహకులు అధికారులకు మామూళ్లు ఇస్తున్నామంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. దీంతో మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా బెల్ట్ దందా సాగుతోంది. వైన్స్ షాపు నిర్వాహకులే వేరే చోట బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారు. ఇలా ప్రజల జేబులకు చిల్లు పడేలా మద్యం దందాను కొనసాగిస్తున్నారు.

కల్తీ మద్యం విక్రయం..

మెండోరా మండలం నిర్మల్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉంది. దీంతో నిర్మల్ జిల్లా నుంచి కల్తీ మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా బెల్ట్ షాపులో ఎక్కువగా చీప్ లిక్కర్ మాత్రమే విక్రయించడానికి కారణమే అది అంటున్నారు. కాని సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణంగా పేదలే తక్కువ ధర మద్యాన్ని సేవిస్తుంటారు. కల్తీ మద్యం విక్రయం వల్ల పేదల ప్రాణాలే సమిధలు అవుతున్నాయి. అధికారులు స్పందించి బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అధికారులను 'సాక్షి' సంప్రదించినా స్పందించలేదు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి ఎంపీపీ పస్క నర్సయ్య భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన యువజన సంఘాల ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగా రెడ్డి, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పండరీపూర్ యాత్రకు కేదారీశ్వర ఆశ్రమ కమిటీ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆశ్రమ కమిటీ సభ్యులు మహారాష్ట్రలోని పండరీపూర్ యాత్రకు బయలుదేరారు. షోలాపూర్‌లో నిర్మించిన గణేష్ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని యాత్రలో భాగంగా పిరమిడ్ మాస్టర్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్సై ఇలియాస్

ఎడపల్లి(బోధన్): తాణాకలాన్ గ్రామంలో ఆదివారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై ఇలియాస్ మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్‌కు వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. రైతులు, మహిళలను ఆధార్, కేవైసీ వంటి వాటి కోసం అపరిచితులు ఫోన్ చేసినా ఓటీపీలు చెప్పవద్దని తెలిపారు. ఎలాంటి అవసరాలు ఉన్నా సంబంధిత అధికారులు, బ్యాంక్ అధికారుల దగ్గరకు వెళ్లి వివరాలు తెలుసుకోవాలని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు తీసుకుంటే 1930కు డయల్ చేస్తే వెంటనే సైబర్ పోలీసులు స్పందించి 24 గంటలలో ఖాతాను లాక్ చేస్తారని చెప్పారు. కానిస్టేబుళ్లు లాలాజీ, భాస్కర్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న మోటూరి మురళి

ఆర్మూర్‌టౌన్: ఆర్య వైశ్యులంతా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మోటూరి మురళి ఆకాంక్షించారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆర్య వైశ్య సంఘం సర్వ సభ్య సమావేశంలో మోటూరి మురళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఎన్నికల్లో భాగంగా తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని అన్నారు. అలాగే వైశ్య కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పురుషోత్తం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోల సుధాకర్, ఆర్మూర్ అధ్యక్షుడు తమ్మి శ్రీనివాస్, జిల్లా మహిళ అధ్యక్షులు గజవాడ మౌనిక, మాజీ కౌన్సిలర్ పోల మధుకర్, నగరేశ్వర దేవాలయ అధ్యక్షుడు బాపురాజు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

■ నందిపేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) – 12.30, 7.00, 10.20
	నా సామిరంగ (తెలుగు) – 3.50
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ – 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)– 11.20, 2.40, 6.00, 9.20
స్క్రీన్-4 –	కెప్టెన్ మిల్లర్ (తెలుగు) – 12.50, 4.00, 10.30
	హనుమాన్ (తెలుగు) – 7.10